

ప్రకృతిమాత నీలిచీరలా గోదావరి ప్రవహిస్తున్నది. నీలిచీర తెల్లపువ్వుల్లా అక్కడక్కడ తెరచాపలు. ఆ ఒడ్డున మే మిద్దరం, కాలేజి విద్యార్థులం కాకినాడ వెళ్లేందుకు పడవకోసం నిరీక్షిస్తూ కూర్చున్నాము.

మే మిద్దరం స్నేహితులం. క్లాసుమేట్సు, రూమ్‌మేట్సు కూడా.

కొద్దిదూరంలో, విశ్వానికి—నా స్నేహితుడికి—అన్నగారు నీతులు గరుపుతున్నారు. వాడేమో విసుగుదల ప్రస్ఫుటంగా అగుపిస్తున్న ముఖ కవళికలతో నదీజలాన్ని పరిశీలనగా చూస్తున్నాడు. ఇంకా వినపడేమిటిరా, బాబూ! అని పైకిమాత్రం అనలేదు గానీ, వాడి తీరు చూస్తుంటే నాకు అంతా తెలిసిపోతున్నది.

ఎలాగో వాళ్ల అన్నగారు వెళ్లిపోయాక నెమ్మదిగా అన్నాడు: "పాతకాలపు మనిషిరా." అని, ఆకాశంవంక చూచి "ఓహో మేఘమాలా" అంటూ కూనిరాగం తీశాడు.

"మేఘమా లేవిరా?" అన్నాను విస్తుపోయి.

"ఒరే, సత్యం! నోరుమూసుకో. నా రసికత్వానికి భంగం కలిగించకు. మేఘాలుంటేనే మేఘమాలా అని పాడాలి?" అని మళ్లీ ఉత్సాహంతో తన ప్రకృతి సౌందర్యారాధనలో లీనమయ్యాడు.

వాడి గోల వాడిది; నా గోల నాది. గంటన్న

చీమ తలకాయంత అయినా మాంసం తిననివాడూ, పేసగింజంత వెర్రిలేని వాడూ కనిపించడేమో. వెర్రి వేయివిధాలు పెరగడం కూడా వెర్రిగానే. మొదట్లో సరదా అనుకొంటారు. ఆ భ్రమలోంచి బయటపడడమంటూ ఉండదు. సరదాకు అంతు ఉండదు. వెర్రి ముదిరి పాకానపడితే తిరుగా ఉండదు. ప్రేమించడం ఒక సరదా, ముఖ్యంగా బ్రహ్మచారులకు.

దాటినా పడవ జాడ లేదు. ఆత్మారాముడి గోల ఎక్కువయింది.

"తినటానికి ఏం తెస్తున్నావురా?" అన్నాను, పొట్టమీద చెయివేసి, అలమటిస్తున్న ప్రేవులను సవరిస్తూ.

"అబ్బబ్బ! నీకెప్పుడూ తిండి ధ్యాసే. వద్దన్నా మా వదిన పులిహోర, గారెలు కట్టించిందిలే. నువ్వు తిని, ఆ గోదారి నీళ్ళుతాగు. లేదా గోదారిలో పడు. లేదా ఆ చెట్టుకింద పవ్వళించు."

"గోదారి నీళ్ళకేం ఖర్మ! కాఫీ తేలేదా?" అన్నాను చిన్నముఖం వేసుకుని.

"ఫ్లాస్కులో ఉంది. నువ్వు తాగి నాకింత ఉంచు."

పులిహోర, గారెలు తిని ఆ ధాటిన పూర్తిగా కాఫీ తాగేశాను మరిచిపోయి. ఎంతకూ పడవ జాడ లేకపోయేసరికి, "కాసిని కాఫీ పోసి ఇవ్వరా" అన్నాడు. అప్పటికి జ్ఞాపకం వచ్చింది. "ఇంకెక్కడి కాఫీ!"

"ఐతే అంతా తాగేశావేమిటి?"

"ఎంత తెచ్చావేమిటి, మహా అంతా అంటున్నావు?" అని అడిగాను.

"అంతా తాగేసిందికాక పైగా ఇదొకటి! నీకోసం పది ఫ్లాస్కుల్లో పోసుకొస్తారు, దద్దమ్మ!" అన్నాడు రుసరుస లాడుతూ.

ఇంకా సాగేదేగానీ, పడవ రాకతో మా కలహం భంగపడింది. సామాను సర్దుకుని పడవలో కూర్చున్నాము. వర్షాకాలం ప్రారంభం. ఎండ తీక్ష్ణంగా లేదు. కాగితం, పెన్సిలు తీసి విశ్వం ఏదో భావ కవిత్వం వ్రాస్తున్నాడు. నాకేమీ తోచలేదు. ఏదో నవల తిరగవేయటం మొదలు పెట్టాను.

మధ్యలో కసిగా అన్నాడు విశ్వం: "వెధవ పేరు. ఏ అనూరాధో అయితే చక్కగా అనూ అనో, రాధా అనో ముద్దుగా పిలుచుకునేవాడిని. స్వరాజ్యలక్ష్మిని ఛందస్సులో ఎలా ఇరికించాలో బోధపడకుండా ఉంది."

నాకు నవ్వాగలేదు. "వాళ్ళ అమ్మా, నాన్నా బారసాలప్పుడు నీ సలహా కోరి పిలవాల్సింది."

"పిలిచే ఉంటే అప్పటినుంచే ప్రేమించేసేవాడిని. నీకు తెలియదుగానీ, ఆ సుందరిని ఒక్కమాటు చూచావంటే దిగ్భ్రమ చెందుతావు."

"నాకు తెలుసులే. మాకు చుట్టాలుగాని...."

"ఆఁ! చుట్టాలా!" అన్నాడు ఉలిక్కిపడి. "కొంపతీసి నీకేమయినా వరసా?"

"లేదులే. భయపడకు. నాకు చెల్లెలవుతుంది."

"హమ్మయ్య, బతికించావు! అవతలకి పోయాక కాఫీ, స్వీటూ ఇప్పిస్తాలే" అన్నాడు తెప్పరిల్లి.

నేను నవ్వుతూ అన్నాను: "ఇప్పుడు వాళ్ళ ఇంట్లోనే నా పుస్తకాలు పెట్టివచ్చాను. మనకు గది దొరికాక అవి తెచ్చుకోవాలి."

"నిజంగానా, సత్యం?" అన్నాడు విశ్వం హుషారుగా. "ఎప్పుడూ చెప్పావు కావు?"

"ఏమంత అవసరం?"

నా జవాబుకు చిన్నమొహం వేశాడు. "అదేమిట్రా, అలా అంటావు! ఈసారి పుస్తకాలు తెచ్చుకోవటానికి వెళ్తావుగా? నన్ను పరిచయం చెయ్యవూ?" ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

పుస్తకాలకోసం వెళ్ళినప్పుడు మా రాజ్యాన్ని పరిచయం చేశాను. కొన్నిరోజుల తర్వాత విశ్వం సంగీత సాధన మొదలుపెట్టాడు. నేను గది ఖాళీచేసి వేరే గది చూసుకుంటానని బెదిరించాను. అయినా వినకుండా డొక్కు హార్మోనియంతో, భావగీతాలతో బాధించేవాడు.

క్రమంగా సంగీతంమీద అశ్రద్ధ చూపాడు. అది నాకెంతో సంతోషం కలిగించింది.

ఒకరోజు గబగబా గదిలోకి దూసుకువచ్చి, "నీకు చంద్రమతి తెలుసా?" అని అడిగాడు.

"తెలియకపోవటమేమిటి? హరిశ్చంద్రుడి భార్య కదా?" అన్నాను.

"ఓరి మొద్దుమొహమా! ఇంకా ఇక్ష్వాకుల నాటి భావాలురా, నీవి" అని దీర్ఘంగా నిశ్వసించాడు. "మన ఫిజిక్స్ లెక్చరర్‌గారి చెల్లెలురా" అన్నాడు.

"అయితే?"

"తెలివికితగ్గ అందం...."

"ఊఁ."

"విద్యకుతగ్గ సుగుణాలు...."

"అయితే?"

"అయితే, గియితే వదలవేమిటి? చెప్పేది సాంతం విను. ఆ అమ్మాయిని తొలిచూపులోనే వలచానురా!"

వాడి వైపు వింతగా చూస్తుండిపోయాను. "మరి స్వరాజ్యలక్ష్మిమాటేం చేశావు?"

"ఆఁ. ఆ వెధవ సంగీత సాధన చిరాకెత్తించింది. లయ, తాళం, గాత్రం, వాద్యం, ఆరోహణలతో ప్రాణం తీసిందనుకో. పి బాబాయి గూడా చంపేశాడులే. పేరుగూడా, అదేమిటి? స్వరాజ్యలక్ష్మి అట! చంద్రమతి మొన్న పోర్షియా పాత్ర నటించింది చూశావా! నిజంగా పోర్షియాలా లేదూ?"

"ఇంతకీ ఆ పిల్ల నిన్ను ప్రేమిస్తోందని నమ్మక మేమిటి?"

"ఇంకా నమ్మక మేమిటిరా, వెధవాయ్! మా ఇద్దరి అభిరుచులూ ఒకటే. ప్రేమిక హృదయాలు విభిన్న పథాలలో పయనించటం అసంభవమని అంతమాత్రం తెలియదూ? మొన్న జూలియస్ సీజర్ నాటకం రిహార్సల్స్ అప్పుడు పరిచయం ఏర్పడింది. ఈసారి శకుంతలగా తను, దుష్యంతుడుగా నేను వేయాలని కూడా అనుకున్నాము."

"ఏమిటీ? దుష్యంతుడి పోర్షన్, పద్యాలతో పాటు నేర్చుకోగలవనే!" అన్నాను వాడి మొద్దుబుర్రను గుర్తుకు తెచ్చుకుని.

"ఆఁ....మరీ....నువ్వు లేవూ, అందివ్వటానికి?"

విశ్వం ఆ టెరమ్ అంతా నాటకాల పిచ్చిలో పడ్డాడు. ఎంతవరకు దిగజారిపోయాడంటే, "ప్రియమైన నాన్నగారికి యూనివర్సిటీ ఫీజుకు అర్జెంటుగా డబ్బు పంపవలసినది"—ఈ ఫక్కీలో నడిచేది వాడి ఉత్తరం. ఇకసంభాషణ: (తనలో) 'చంద్రమతికి ప్రేమకానుకగా ఏమైన కొనవలెను.' (ప్రకాశముగా) "ఓరీ, సత్యం! స్త్రీ హృదయమునకు నచ్చిన దేమిటో చెప్పగలవా?"

ఒక విల్లు, అంబుల పొది తీసుకుని, తువ్వు కిరీటం పెట్టుకుని, దుష్యంతుడి పోజులో గదిలో అటూ ఇటూ తిరుగుతూ పద్యాలు పెద్ద గొంతుతో పాడుతుండేవాడు. "పోర్షన్ కంఠస్థం చేయడం మాట ఏమి"టంటే, "డ్రామా వేసేటప్పుడే ఆ ఇన్స్పిరేషన్‌లో అదే నడిచి వచ్చేస్తుంది" అనేవాడు!

డిసెంబరు పరీక్షలు అయిపోయాయి. సంక్రాంతి సెలవలకు ఇంటిముఖం పట్టాము. కొత్త అల్లుళ్ళ హడావిడి హెచ్చుగా ఉంది. "విశ్వానికి వేసవిలోనైనా పెళ్ళి చేయండి" అని వాళ్ళ మేనమామ గీపెట్టాడు. "సుశీల పెద్దదయిపోతోంది. వేరే సంబంధం చూసుకుంటాము" అని బెదిరించాడు. విశ్వానికి ఇదంతా అయోమయంగా ఉంది.

సెలవులయిపోయాయి. తిరిగి కాలేజీలో ప్రవేశించాము. ఒకరోజు విశ్వం ఒక హాకీ స్టిక్‌తో గదిలోకి వచ్చాడు. కాళ్ళమీద దెబ్బలకు మందు రాస్తూ కూర్చున్నాడు. నాకు నవ్వూ, ఆశ్చర్యం ఒకేసారి వచ్చాయి. "హాకీ పిచ్చి ఎప్పటినుంచి రోయ్?" అన్నాను, ఉండలేక.

"మేరీ—లేడీస్ గేమ్స్ సెక్రెటరీ..."

"ఓహో!" అన్నాను మేరీ తెలుసు కాబట్టి. నల్లగా, తెల్లగా, పొడుగ్గా, చలాకీగా ఉంటుంది. మంచి హుషారుగలది ఆటల్లో.

"మొన్న ఎగ్జిబిషన్‌లో బెలూన్లు, రబ్బరు బొమ్మలు అమ్మేవాడిని మన స్టాలువైపు పంపింది. అంతలో అమ్మాయిలందరూ కిలకిలా నవ్వారు. పైగా బెలూన్లవాడు నాలుగు బెలూన్లను బల

## కోమలాదేవి

పంతాన నాకు అంటగట్టి మరీ వెళ్లాడు. నాకు వద్దురా, బాబూ అని మొత్తుకున్నా విన్నాడు కాదు. నీతో సినిమాకి వచ్చినా బాగుండేది. బెంగాన్ని పట్టుకుని అప్రమత్తతతో స్టాల్ బయటికి వస్తుసుగదా, మేరీ నవ్వుతూ, కొంటెగా చూచింది. ఆ చూపు, ఆ నవ్వు నన్ను వివశుణ్ణి చేశాయనుకో.''

''హరి పిడుగా! ఇంతకూ చంద్రమతికి ఇచ్చిన హృదయం....''

''తిరిగి వచ్చిందిలే'' అన్నాడు తాపీగా.

''ఆమె ఏమయిందిరా?'' అన్నాను.

''హరిశ్చంద్రుడితో అడవులకు వెళ్లిందిలే.''

''ఆ చంద్రమతి కాదురా. ఫిజిక్స్....''

''వాళ్ళే. నువ్వా, నీ విటమ్నాను. ఇక కాలేజ్టడే సెలరోజులేనా ఉంది? ఆ దుష్టురాలు మరొకరిని దుష్యంతుడుగా ఎన్నుకుంది, వాడిలో ఏమి అందం చూచిందో?''

''పోర్షన్ నేర్చుకోరాలంటేవిన్నావూ, మరి?'' అన్నాను జాలిగా చూస్తూ.

''ఛ ఛ! వెధవ నాటకాలు. పోనిద్దూ. ఆట లైతే అటు ఉత్సాహమూ, ఇటు ఆరోగ్యమూ కలిగిస్తాయి.''

''అంతేనటరా? కాళ్ళకు దెబ్బలు తగిలిస్తాయి. ఐనా హాకీ దేనికిరా? ఏదో తేలికగా, హాయిగా అయిపోయే పింగ్‌పాంగ్, కారమ్స్ ఆడుతూ కూర్చోక, ఈ పరుగులా....''

''హుం! నా సంగతి నీకు తెలియదులా ఉంది. రేపు ఇంటర్ యూనివర్సిటీ మాచ్ జరిగే టప్పుడు నా తడాఖా చూద్దువుగాని. చిన్న క్లాసుల్లో నా హాకీ ఆట చూడలేదటరా, నువ్వు? మరిచిపోయావా?''

అందరూ ఆడినట్లే, వాడూ నాలుగైదు సార్లు ఆడాడు. కాళ్ళు విరగ్గొట్టుకున్నాడు. అంతటితో స్వస్తిచెప్పాడు. జ్ఞాపకం లేకపోవట మేమిటి?

''సరేలే. చదువుకో. మీ అన్న నన్ను పట్టుకు తిడతాడు'' అనేసి, పుస్తకాలు ముందు వేసుకుని కూర్చున్నాను.

పరీక్షలు, ప్రాక్టికల్సు అయిపోయాయి. హాకీ మాచీలో మనవాడి పేరు ఉంది. అంతే. అంటే ఎక్స్ట్రా కింద. ఆ దెబ్బతో వాడు పరీక్షలమీద శ్రద్ధవహించాడు గాని, లేకపోతే మా కాలేజి టీమ్ గెలవటానికి తానే కారకుడుగా భావించి ఆకాశంలో విహరించేవాడు, మేరీతో సహా.

ఏ మాట కామాటే చెప్పుకోవాలి. మరీ నిస్పృహ చెందుతాడని మా గేమ్సు సెక్రటరీకి చెప్పి వాడి పేరు ఎక్స్ట్రా కింద వేయించింది నేనే. సెక్రెటరీ, నేనూ చాల స్నేహితులం.

నామమాత్రం ఫిజిక్స్ ప్రాక్టికల్స్ మిగిలాయి. ఆరోజు సాయంత్రం గదికి వచ్చేసరికి విశ్వం దిగులుగా కూర్చుని ఉన్నాడు.

''ఏమిటిరా, సంగతి?'' అన్నాను మామూలు ధోరణిలో. ''మేరీని గుర్చేనా?''

''ఛీ. ఆ పిల్ల పేరెత్తకు'' అని గర్జించాడు.

నేను అమాంతం మూర్ఛ పోలేదు. నవ్వు వచ్చింది. బిగబట్టుకుని జాలిగా అడిగాను: ''అసలు సంగతేమిటి?''

పాంటు మోకాలివరకు లాగి, మానిన దెబ్బలు సవరించుకుంటూ, ''మేరీ వెళ్తుంటే స్టేషన్‌కు వెళ్లాను, ఓ ప్రేమలేఖ అందిద్దామని. చాలా హుషారుగా గుడ్‌బై చెప్పి తన పెళ్లికి తప్పక రావాలని ఆహ్వానించింది'' అన్నాడు.

''అందులో తప్పేముందని?'' అన్నాను తాపీగా.

''తప్పా! నీకన్నీ తేలికగా అగుపిస్తాయి. ఆశ చూపించి హృదయాన్ని దోచుకుని మోసగించటం ఈ ఆడవాళ్ళకే తగు. ఛీఛీ! స్త్రీహృదయం ఎంత చపలం!'' అంటూ గదిలోపల పచార్లు చేయటం ప్రారంభించాడు.

'హమ్మయ్య' అనుకుని, వాడికి కనువిప్పు కలిగినందుకు ఎంతగానో సంతోషించాను.

పరీక్షలయిపోయాయి. మా పల్లెకు మేము వెళ్లిపోయాము. రోజూ కలిసి షికారుకు అలా ఏ చెరువుగట్టుకో వెళ్లేవాళ్ళం.

ఓ వారంరోజులు నేను పనిమీద పొరుగూరు వెళ్లవలసి వచ్చింది. వెళ్లివచ్చాను. స్నానం, భోజనం కానిచ్చి విశ్వం ఇంటికి వెళ్లాను. అక్కడి దృశ్యంచూచి నా కళ్లను నేను నమ్మలేకపోయాను.

వాడు శుభలేఖలను ముందువేసుకుని పేర్లు వ్రాస్తున్నాడు. నన్ను చూచి విప్పారిన ముఖంతో ఓ శుభలేఖ అందిస్తూ, ''ఇది చూడు. ఆ తర్వాత మీ ఇంటికొచ్చి స్వయంగా ఆహ్వానిస్తాను'' అన్నాడు.

నా దృష్టి వధువుపేరుమీద పడింది. సుశీల అని ఉంది.


''మీ మరదలుగాని కాదుకదా?'' అన్నాను, అనుమానం లేకపోయినా.

''అనుమానం దేనికి? మరదలుపిల్లే!'' అన్నాడు మావాడు.

నా ముఖ కవళికలు చూచి ముఖం మాడ్చు కుని ''అంతగా ఆశ్చర్యపడిపోతావేమిటిరా?'' అన్నాడు.

మాటలు నాన్నాను. ''అవ్వే. సుశీలకు పెద్ద చదువు లేదనీ, అంత అందగత్తె కాదనీ....''

''అన్నాననుకో. కానీ పెళ్లి చూపులకు తప్పక వెళ్లవలసి వచ్చిందిరా. వెళ్లాను. చూచాను. ప్రథమ వీక్షణంలోనే ప్రేమించేశాననుకో. ముందు మనసులో అనుకున్నవీ, అన్నవీ అన్నీ ఉపసంహరించుకునేసి ఒప్పేసుకున్నాను. ఐనా, సత్యం! సొంత మరదలు పిల్ల ఉండగా పరాయి పిల్లను ఎలా చేసుకోగలను? నువ్వే చెప్పరా'' అన్నాడు విశ్వం. ★



ఉదయభానుడు

చిత్రం — కె. శశిభూషణ్